

సచివాలయానికి దారేదీ..?

పెద్ద సవలాపురం గ్రామ సచివాలయానికి వెళ్లేందుకు నేమ్ బోర్డు లేకపోవడం వలన అర్జీదారులు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల సయయంలో నేమ్ బోర్డును అధికారులు తొలగించారు. అయితే ఎన్నికలు ముగిసి సుమారు 6 నెలలు గడుస్తున్నా ఇంతవరకు నేమ్ బోర్డు ఏర్పాటు చేయలేదు. దీనివలన అక్కడ సచివాలయం ఉందా, స్కూల్ బిల్డింగ్ ఉందా అనేది అర్థం కావడం లేదని పలువురు తికమకపడుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. త్వరలో నేమ్ బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. – సరుబుజ్జిలి



పుట్టిన రోజుకో మొక్క

పొందూరు మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వారి పుట్టిన రోజును పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతూ జరుపుకోవడం అలవాటుగా చేసుకున్నారు. మంగళవారం బొంగు నవ్యశ్రీ అనే విద్యార్థిని తన పుట్టినరోజు సందర్భంగా రెండు మొక్కలను నాటింది. వాతావరణ సమతుల్యం, పర్యావరణ పరిరక్షణ ఇక్కడ విద్యార్థులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పర్యావరణ మిత్ర ఉపాధ్యాయుడు పూజారి హరిప్రసన్న తెలిపారు. సుమారు ఐదేళ్లగా ఈ కార్యక్రమం చేస్తున్నామని చెప్పారు. – పొందూరు



ఆశాజనకంగా సాగు

ఐసీఏఆర్–ఎన్ఆర్ఆర్ఐ నైరా వ్యవసాయ కళాశాల అందజేసిన ముంపునకు తట్టుకునే నూతన వరి వంగడాలు సీఆర్ దస్- 412, 414 నంబర్ల వరి విత్తనాల పంటసాగు ఆశాజనకంగా ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు బి.కిరణ్ గాంధీ, శ్యామ్‌లు తెలిపారు. ఈ విత్తనాలను సాగు చేస్తున్న పంటలను మంగళవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ రెండు రకాల వరి పంటలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైనా, పంట నష్టపోలేదని రైతులు తమ అభిప్రాయాలను వివరించారు. – కొత్తూరు



తాగునీటి నాణ్యతెంత..

పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో కుళాయి ద్వారా వచ్చే తాగునీటి నాణ్యతను మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.కరుణకరరావు, ఎంపీడీవో చంద్రకుమారిలు మంగళవారం పరిశీలించారు. శివశంకర్ కాలనీలో కుళాయి ద్వారా వచ్చే తాగునీటిని అధికారులు, పంచాయతీ సిబ్బంది పరీక్షించారు. మేజర్ పంచాయతీలో 80 వీధులకు కుళాయి ద్వారా తాగునీరు అందిస్తున్నామని, పలు వీధుల్లో తాగునీరు పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు. – పాతపట్నం

క్లుప్తంగా

నేడు ప్రజా దర్బార్

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్, తహసీల్దార్ హనుమంతురావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా దర్బార్ ఉంటుందన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వారు వారివారి సమస్యలపై వినతులు అందించవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా కొమరం భీమ్ జయంతి



కొమరం భీమ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఆదివాసీ భవనం వద్ద ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కొమరం భీమ్ 123వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ భవనం ఆవరణలో ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, జిల్లా అధ్యక్షుడు గురడి అప్పన్నలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యోగి మాట్లాడుతూ దేశంలో ఆదివాసీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు చరిత్రాత్మకమైనవన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు పి.సురేష్, జె.వాసు, శరత్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

జలుమూరు: వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి అన్నారు. మంగళవారం శ్రీముఖలింగం బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు ప్రశ్నలు అడిగారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వసతి గృహం అధికారి విధులకు డుమ్మా కొట్టడంపై అగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారని సిబ్బంది సమాధానం ఇవ్వగా, రోజులో ఒక గంట అయినా ఇక్కడ వసతి గృహంలో ఉండాలి కదా అని ప్రశ్నించారు. అలాగే ఎంతమంది విద్యార్థులు ఉన్నారో రికార్డులు పరిశీలించారు. అనంతరం శ్రీముఖలింగం తాగునీటి పథకం పరిశీలించారు. ఆమెతో పాటు ఎంపీడీవో కొమరాపు తిరుపతిరావు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమా మహేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ జయలక్ష్మి

ఎల్.ఎన్.పేట: రైతుల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని తహసీల్దార్ జె.జయలక్ష్మి అన్నారు. బొత్తాడసింగి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గవరయ్య, స్థానిక పెద్దలు అంపిలి పోలినాయుడు, ఈగల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్

పోలాకి: వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ మంగళవారం పోలాకి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆవరణలో మొక్కను నాటిన తర్వాత పరిసరాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, క్రైం రేట్ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్ తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణపై అవగాహన

హిరమండలం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ, విధివిధానాలు, పోలీస్ చట్టం అనే అంశాలపై ఎస్ఐ మహ్మద్ యాసిన్ అవగాహన కల్పించారు.

మిత్రమా నీ జాడెక్కడ..?

- వ్యవసాయంలో అంతరిస్తున్న మిత్ర పురుగులు
- అధిక రసాయనాల వినియోగంతో ఇబ్బందులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్న రైతు

హిరమండలం: పేరుకు పురుగులే అయినా కొన్ని రకాల కీటకాలు రైతులకు చాలా మేలు చేస్తాయి. ప్రస్తుతం రసాయనాల వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో వీటి జాడ కనుమరుగైపోతోంది. క్రిమి సంహారక మందులు మోతాదుకు మించి వాడుతుండడంతో శత్రు పురుగులతో పాటు పంటలను సంరక్షించే మిత్ర పురుగులు సైతం అంతరించిపోతున్నాయి. దీనిపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

నియోజకవర్గంలో వరిసాగు వివరాలు		
మండలం	హెక్టార్లు	రైతులు
పాతపట్నం	8,699	14,726
హిరమండలం	3,364	6,716
కొత్తూరు	10,374	13,914
మెళియాపుట్టి	7,741	12,235
ఎల్ఎన్‌పేట	4,464	8,487

పాతపట్నం నియోజకవర్గంలో 34,642 హెక్టర్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ద్వారా గ్రామాల్లో పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాల ద్వారా పురుగు మందుల వినియోగంతో నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రూపాయి ఖర్చు లేకుండా..

కందిరీగ, మిడత, పాడిసన్‌బగ్ వంటి మిత్ర పురుగులు పంటను ఆశించే చీడపీడ సంతతి పెరగకుండా నివారిస్తాయి. ఇలా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా రైతన్న పంటకు రక్షణగా నిలుస్తున్నాయి. కానీ కర్షకుల నిర్లక్ష్యం కారణంగా అవి నశించి పోతున్నాయి. ముఖ్యంగా క్రిమి సంహారక మందులు అతిగా పిచికారీ చేయడంతో మిత్ర పురుగులు చనిపోతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

గుడ్లు తింటూ రక్షణ

పంటలను ఆశించే పచ్చ, లద్దె పురుగులు గుడ్లు పెట్టి సంతానం పెంపొందించుకుంటాయి. ఇవి పంట ఆకులు, లేత భాగాలపై గుడ్లు పెడతాయి. అలా గుడ్లు నుంచి బయటకొచ్చిన వాటి సంతతి పూత, ఆకు, పిందెలు తింటూ పంటకు నష్టం కలిగిస్తాయి. అయితే ట్రైకోగ్రామా అనే మిత్ర పురుగు పచ్చ, లద్దె పురుగుల సంతతి పెరగకుండా పంటను రక్షిస్తుంది. అక్షింతల పురుగులు, దోమ, నల్లి, తామర తదితర పురుగులను తింటుంది.

సాలీడు, తూనీగ

పొలాలకు సమీప తుప్పలు, చెట్లపై సాలీడు గూళ్లే ఉంటే పచ్చ, లద్దె పురుగుల సంతతి, రెక్క పురుగులు, దోమలు, నల్లులు ఇరుక్కుపోతాయి. వీటిని సాలీడులు తిని సంతతిని నివారిస్తాయి. చీడ పురుగులు పంటలపై పెట్టిన గుడ్లును తూనీగలు తినడమే కాకుండా పరపరాగ సంపర్కం జరగడానికి దోహదపడతాయి.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది



వరి చేనుకు ఆశించిన చీడ పురుగులు

అవసరం మేరకే వినియోగించాలి



క్రిమి సంహారక మందులు అవసరం మేరకే వినియోగిస్తే మిత్ర పురుగులను రక్షించుకోవచ్చు. కొందరు మోతాదుకు మించి వాడడంతో వాటిపై ప్రభావం పడుతోంది. పంటపై ఒకటి, రెండు చీడ పురుగులు కనబడితే నివారణ మందులు వాడాల్సిన అవసరం లేదు.

– బి.సంధ్య, ఏవో, హిరమండలం

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న జిల్లా బాలల రక్షణ అధికారి మల్లేశ్వరరావు

హిరమండలం: బాల్య వివాహాల నిషేధంపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా బాలల రక్షణ అధికారి మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ కమ్యూనిటీ భవనంలో హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో బాల్యవివాహ నిరోధక, బాలల రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీరితో ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అనధికార దత్తత వల్ల కలిగే నష్టాలు, స్పాన్సర్‌షిప్ పథకం, పోస్టర్, ఆఫ్టర్ కేర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ యు.విమలకుమారి, సూపర్‌వైజర్లు కె.సుధావాణి, వై.ఈశ్వరి, గొస్యబేగం, ఏ.సరస్వతి, భవానీ, జ్యోతి, లక్ష్మీ పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు పాతపట్నం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాతపట్నం: జాతీయ స్థాయి రగ్బీ క్రీడాపోటీలకు పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టి.హేమసుందర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 5, 6వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో అండర్–19 బాలురు విభాగంలో పి.రుధికుమార్, సీహెచ్.మౌళీలు ప్రతిభ కనబర్చి, ద్వితీయ స్థానం సాధించారు. బీహార్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

సంక్షిప్తంగా...

పారిశుధ్య పనులకు ప్రాధాన్యం

ఎల్.ఎన్.పేట: పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రత్యేక అధికారి ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని తురకపేట, కోవిలాం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయనతో పాటు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తవిటినాయుడు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

నరసన్నపేట: గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో ఎల్ఎన్వీ శ్రీధర్ రాజు సూచించారు. మండలంలోని జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట జగనన్న లేఅవుట్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల తీరును ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో మధుసూదనరావు, హౌసింగ్ ఏఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్లో రికార్డులు, ఖైదీల గది, సెట్ వినియోగం, కేసులకు సంబంధించిన వివరాలు గూర్చి పోలీసులు వివరించారు.

మురుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో కృష్ణ మోహన్ సూచించారు. మండలంలోని కుమ్మరిగుంట అంగన్‌వాడీ కేంద్రానికి మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ ప్రభాకర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సారవకోట: రీ సర్వే పూర్తైన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని మాళువ పంచాయతీ సవరమాళువ గ్రామంలో గ్రామసభ మంగళవారం నిర్వహించారు.

రెవెన్యూ రికార్డుల్లో తప్పుల సవరణ

నరసన్నపేట: భూసర్వే నిర్వహించిన గ్రామాల్లో రైతుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని యారబాడులో గ్రామసభలను ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాబాజి రమేష్, ఎంపీటీసీ పాపినాయుడు, మండల సర్వేయర్ అప్పలస్వామి, మాజీ సర్పంచ్ పూతి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: రెవెన్యూ సదస్సులో రైతులు అందించే అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ హనుమంతురావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నీలిమలు అన్నారు. మండలంలోని తంప గ్రామంలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

పాఠశాల తనిఖీ

హిరమండలం: మండలంలోని నాగూడ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కె.రాంబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరుపట్టిక పరిశీలించారు.

వైద్య సిబ్బంది పర్యటన

పొందూరు: మండల కేంద్రంలో తాడివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం పర్యటించారు. డయేరియా వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డా.రమేష్‌నాయుడు, డాక్టర్ నవీన్‌లు మాట్లాడుతూ మల విసర్జన తర్వాత, ఆటలాడుకునే తర్వాత, భోజనం చేసే ముందు చేతులు సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సరుబుజ్జిలి: పంటలు సాగు చేస్తున్న సమయంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం అన్నారు. మండలంలోని చిగురువలస గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ బృందం పర్యటించారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు మోతాదుకు మించకుండా వేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాము, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గేటు బయటే విద్యార్థులు

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమయానికి తెరవకపోవడంతో పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంది. దీంతో విద్యార్థులు ఉదయం 7.45 గంటలకే పాఠశాలకు చేరుకున్నారు. అయితే పాఠశాల గేటు తీయకపోవడంతో బయటే వేచి ఉండాల్సి వచ్చింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో పోలీసులు సైతం విషయంపై వాకబు చేశారు. పాఠశాల సిబ్బంది 8.45 గంటలకు వచ్చి తాపీగా గేటు తాళాలు తెరిచారు. అంతవరకు పోలీసులు విద్యార్థులతో పాటే ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

పాతపట్నం: భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని ఏఎస్ కవిటి గ్రామంలో రెవెన్యూ గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రీ సర్వే చేసిన భూములను రైతులు సరిచూసుకోవాలన్నారు. మొత్తం 36 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామగణపతి, బాబ్జి, సతీష్, రీసర్వే డీటీ సునీల్ కుమార్, ఆర్ఐ బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నట్టల నివారణ మందులు



జీవాలకు నట్టల నివారణ మందులు వేస్తున్న దృశ్యం

పాతపట్నం: గొర్రెలు, మేకల పెంపకందారులు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న నట్ల నివారణ మందులను వినియోగించుకోవాలని పాతపట్నం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.కరుణాకరరావు సూచించారు. మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో గొర్రెలకు నట్టల నివారణ మందులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం మండలంలో 16,350 జీవాలకు, మెళియాపుట్టి మండలంలో 23,800 జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేయడానికి నిర్ణయించినట్లు చెప్పారు. ఈనెల 25వ తేదీలోపు రెండు మండలాల్లో ఏడు బృందాల పర్యవేక్షణలో పంపిణీ జరుగుతుందన్నారు. ఈ మందు వేయడం వలన గొర్రెలు, మేకల మరణాల శాతం తగ్గించడానికి, శరీర బరువు పెంచుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యురాలు కె.మౌనిక, సర్పంచ్ ఉదయ్‌భాస్కర్, నిరంజన్, ఉత్తమరావు, మోహన్, శంకర్, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణంతో మేలు



జిల్లేడు ద్రావణం తయారు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: వరి పొలంలో జిల్లేడు కషాయం వినియోగించడం వలన పొటాష్‌ను నివారించవచ్చని మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని కంఠమానుగూడ, కుంటిభద్ర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంట పొలాల గట్లు చుట్టూ కంది, కూరగాయలు వంటివి సాగు చేయడం ద్వారా అదనపు లాభాలు పొందవచ్చన్నారు. పొలాల్లో పక్షుల స్థావరాలు, లింగాకర్షక బుట్టలు, జిగురు పూసే పసుపు రంగు అట్టలును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, ఎంటీ సవర సూర్యనారాయణ, ఐసీఆర్‌పీలు మొఖలింగం, బాలకృష్ణ, భూదేవి, మహాలక్ష్మి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

దూసుకెళ్తూ.. బోల్తాపడుతూ..

- ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా
- బోల్తా పడుతున్న ట్రాక్టర్లు



గాజులకొల్లివలస వద్ద బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

ఆమదాలవలస: మండలంలో వంశధార నదీతీరం చెవ్వాకులపేట ర్యాంపు నుంచి ఇసుక తీసుకువస్తున్న ట్రాక్టర్ మంగళవారం గాజులకొల్లివలస సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అదృష్టవశాత్తు ప్రయాణికులు ఎవరూ లేకపోడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఇసుకను అధిక పరిమాణంలో తరలిస్తూ డ్రైవర్లు అతివేగంతో వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఇష్టారాజ్యంగా రవాణా..

ఆమదాలవలస మండలంలో వంశధార, నాగావళి నదుల్లోని ఇసుక ర్యాంపుల వద్దకు వెళ్లి ఇసుకను తీసుకువస్తున్న వేల సంఖ్యల్లో ట్రాక్టర్లకు డ్రైవర్లుగా చలామణి అవుతున్న వారిలో చాలామందికి లైసెన్సులు ఉండటం లేదు. మైనర్లు సైతం వాహనాలు నడిపిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో రికార్డులు ఉండటం లేదని అంటున్నారు. అధిక పరిమాణంలో ఇసుక తీసుకెళ్లినా ఎవరూ ఆపరని సాక్షాత్తు ప్రభుత్వ పెద్దలే ప్రకటన చేయడంతో కొందరు డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంభంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

పాతపట్నం: గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రెడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జె.వి.రమణ అన్నారు. మండలంలోని రంకిణి గ్రామంలో ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎంపీటీసీ గీత, సర్పంచ్ సింహాచలం మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వ పథకాలకు ఎలా దరఖాస్తులు పెట్టాలని తెలియజేశారు. అనంతరం గిరిజనుల నుంచి పలు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రామచంద్రరావు, యోగి, సచివాలయ ఉద్యోగులు, భగంతర, రంకిణీ, బురికిపేట గిరిజనులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిపించాలి



గుత్తావల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డాక్టర్ మీనాక్షి

బూర్జ: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిపించాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మండలంలోని గుత్తావల్లి పీహెచ్‌సీలో మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఫార్మసీ గదిని తనిఖీ చేసి మందులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎ.రమ్య, డాక్టర్ పి.రోజా తదితరులు పాల్గొన్నారు.